నారుమడులకు ముంపు లేకుండా చూడాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నారుమడులు వేసుకున్న రైతులకు ముంపునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భీమవరం నియోజకవర్గంలో ఆకుమడులు ఎంతవరకూ వేశారు, వరినాట్లు ఎంతవరకూ పడ్డాయనేదానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు నిర్ణీత సమయానికి రైతులు సాగు ఆరంభించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏటా ఖరీఫ్‌లో వర్షాల వల్ల రైతులు పంట నష్టపోతున్నారని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వై.రవికుమార్, డిఇలు శ్రీనివాస్, పిఎస్ఎస్.మూర్తి, ఎఇ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

గోదావరి పరవళ్లు

లంక గ్రామాలకు పొంచి ఉన్న ముంపు
నీట మునిగిన కనకాయలంక కాజ్వే
నరసాపురంలో పరిస్థితిని సమీక్షించిన ఎస్పి

కరుగోరుమిల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి

ప్రజాశక్తి - ఆచంట

గోదావరిలో వరద పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో శుక్రవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద 24 గంటల్లో రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించలేదు. వరద ఉధృతి ఇదే విధంగా కొనసాగితే రెండు రోజుల్లో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరుగోరుమిల్లి వద్ద పుష్కరఘాట్ పూర్తిగా నీట మునిగింది. లంక గ్రామాల రైతులు ముందు జాగ్రత్తగా కొబ్బరి చెట్ల దింపు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొబ్బరికాయలను పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పశువులను ఏటిగట్టు పైకి తరలిస్తున్నారు. ఆచంట ఎస్ఐ రాజకుమార్ మండలంలోని పెదమల్లం పర్యాటక కేంద్రం, పెదమల్లం మాసేనమ్మ ఆలయం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలోని పుష్కర ఘాట్‌లను సందర్శించి రైతులతో మాట్లాడారు. ముందుజాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్యం వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నీట మునిగిన కనకాయలంక కాజ్వే

యలమంచిలి: గోదావరి వరద ఉధృతికి మండలంలోని లోతట్టు ప్రాంతమైన కనకాయలంక గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలోని కాజ్వే పూర్తిగా నీట మునిగింది. దీంతో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ గ్రామం యలమంచిలి మండల పరిధిలో ఉన్నప్పటికీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చాకలిపాలెం ఏటిగట్టుకు సమీపంలో ఉంటుంది. పూర్తిగా గోదావరి మధ్యలో ఉండటం వల్ల స్కూల్, కళాశాల, ఇతర అవసరాలకు కాజ్వే దాటి చాకలిపాలెం వెళ్లాల్సి ఉంటుంది. కాజ్వే నీట మునగడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో పడవలపై రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. శుక్రవారం ఉదయం నుండి కాజ్వేపై రాకపోకలు నిలిచిపోయినప్పటికీ సాయంత్రం వరకు కూడా ప్రభుత్వ అధికారులు పడవలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ బోటులను ఆశ్రయించి అధిక మొత్తంలో సొమ్ము చెల్లించి ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆ గ్రామస్తులు చెబుతున్నారు.

కనకాయలంక కాజ్వేపై చేరిన వరద నీటిలో నుంచి నడిచి వస్తున్న గ్రామస్తులు

పెనుగొండ: మండలంలో సిద్ధాంతం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో సమీప లంకల్లో సాగు చేసిన కూరగాయ రైతులు పంటలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పశువులను ఏటిగట్టుపైకి చేర్చే ప్రయత్నం చేస్తున్నారు.

నరసాపురం టౌన్: గోదావరికి వరద ఉధృతి నేపథ్యంలో పోలీసు శాఖ తరపున ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఎస్పి యు.రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం నరసాపురం మున్సిపాలిటీ పరిధిలో పొన్నపల్లి, వలంధరరేవు, నవరసపురం గోదావరి పరివాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి విలేకరులతో మాట్లాడుతూ 24 గంటల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గట్టు బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలు వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్పి వెంట డిఎస్పి కె.రవిమనోహరాచారి, సిఐలు జి.శ్రీనివాస యాదవ్, వి.సురేష్‌బాబు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: ఎగువున కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతాలైన ఆచంట, యలమంచిలి, నరసాపురం లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా గోదావరి వరద తాకిడికి గురయ్యే అవకాశం ఉందని, లంక గ్రామాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సంసిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో టోల్‌ఫ్రీ నంబర్ 08816 299189ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏదైనా అత్యవసర సమాచారం, సహాయం కోసం ఈ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేతన్నలకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నేతన్నలకు అండగా నేతన్న నేస్తం : కలెక్టర్

లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.48 కోట్లు జమ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం 5వ విడత కింద రూ.2 కోట్ల 48 లక్షల 48 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా వెంకటగిరి బహిరంగ సభలో 5వ విడత వైఎస్ఆర్ నేతన్న నేస్తం రాష్ట్రవ్యాప్తంగా 80,686 మంది నేతన్నలకు ఒక్కొక్కరికీ రూ.24 వేలు చొప్పున రూ.193.64 కోట్లు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 1,027 మంది లబ్ధిదారులకు రూ.24 వేలు చొప్పున రూ.2.46 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుందన్నారు. నేతన్నలు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి నమూనా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్.రఘునంద, జౌళి శాఖ విస్తరణ అధికారి బి.రామయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూరుశాతం ఇ-పంట నమోదు చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇ-పంట నమోదు నూరుశాతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన వరి నాట్లు వేయించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. తద్వారా ప్రతికూల వాతావరణంలో ఇబ్బందుల నుండి గట్టెక్కుతామని సూచించారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగించాలన్నారు. రైతులకు టార్పాలిన్స్ అందించాలని సూచించారు. ఇ-పంట నమోదుకు ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. గత రబీ ధాన్యం కొనుగోళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలను చేపట్టాలని డిఎం సివిల్ సప్లయీస్‌ను ఆదేశించారు. గునుపూడి సౌత్ మేజర్ మురుగు కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. రాయలం డ్రెయిన్ పూడిక తీత పనులు కూడా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు సంఘాని వడ్డికాసులు, జల వనరుల శాఖ ఇఇ దక్షిణామూర్తి పాల్గొన్నారు.

కొనసాగిన విఆర్ఎల నిరసన దీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

విఆర్ఎల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద విఆర్ఎల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండో రోజు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో విఆర్ఎలు మోకాళ్లపై నిల్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోటిపల్లి వేణు, చంటి బాబు, గణేష్, కృష్ణ, సత్యనారాయణ, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన నిరసన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు తలుపురి ముత్యాలరావు మాట్లాడుతూ విఆర్ఎలకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, నాయకులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్‌రావు, వద్దిపర్తి శ్రీనివాస్, విఆర్ఎలు సాయిరాం, ముత్యాలరావు, సత్యనారాయణ, భుజింగరావు పాల్గొన్నారు.

పోడూరు : విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం అధ్యక్షులు బెల్లాన్ని ప్రకాశరావు, కార్యదర్శి కడిమి ఏసు, కోశాధికారి నల్లి సుమన్, ఉపాధ్యక్షులు కంతేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి : ఉండిలో రెండో రోజు శుక్రవారం విఆర్ఎలు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. విఆర్ఎలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు ధనికొండ శ్రీనివాస్, రామకూరి వెంకటరత్నం, విఆర్ఎలు పిల్లి సుబ్బారావు, ముత్యాలపల్లి నాగరాజు, బాబ్జి, యేసు రత్నం, కొడవర్తి శ్రీను, సయ్యద్ హజార్ మొహిద్దిన్, రాజగోపాలం, నల్లబ్బాయి పాల్గొన్నారు.

పాలకొల్లు : విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా శుక్రవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో విఆర్ఎ సంఘం మండల అధ్యక్షులు రాపాక నరేష్, సెక్రటరీ తంగెళ్ల గోవింద్, ట్రెజరర్ తాడిపర్తి వెంకటేశ్వరరావు, మద్రే వరప్రసాద్, దేవరకొండ నాగేశ్వరరావు, శివకుమార్, ఏసోబు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు రెండో రోజు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండలాధ్యక్షుడు మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులు రాపాక ప్రసాద్, ట్రెజరీ కొత్తపల్లి సుబ్బారావు, నాగులు పాల్గొన్నారు.

తణుకురూరల్ : జగన్మోహన్‌రెడ్డి విఆర్ఎలకు ఇచ్చిన హామీలు ఎందుకు

మొగల్తూరులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

అమలు చేయడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విఆర్ఎల సమస్యలపై నిరసన దీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.బలరాం, కె.బ్రమ్మయ్య, కె.పోసిబాబు, వినయవతి, విశ్రాంతి, ఎం.జ్యోతి, ధర్మారావు, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్దకు విచ్చేసిన నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజకు, తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్‌కు విఆర్ఎలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమవరం డివిజన్ అధ్యక్షులు పండు మాట్లాడారు. వెంటనే విఆర్ఎ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.

పెనుగొండ : విఆర్ఎలకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విఆర్ఎలు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు బుంగా గణేష్, వి.పాపారావు, బొక్క దుర్గాప్రసాద్, కె.వెంకట్రావు, జి.రవికుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం మండల అధ్యక్షుడు గుమ్మళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పెంటపాటి నరసింహమూర్తి, కార్యదర్శి మాగపాటి నరసయ్య, సభ్యులు ఆట్రగడ్డ వెంకట తాతారావు, మీనారాణి, షేక్ మస్తాన్ బీబీ పాల్గొన్నారు.

యలమంచిలి : తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన నిరసన దీక్షలు రెండో రోజు కూడా కొనసాగాయి. ఈ దీక్షలకు సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే నిరవధిక సమ్మె

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం భీమవరం మున్సిపల్ ఆఫీస్ వద్ద రెండో రోజు నిరసన దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 6 నెలల్లో మున్సిపల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు ఇతరులెవరూ చేయలేరని, లక్ష రూపాయలు ఇచ్చినా వారి రుణం తీర్చుకోలేనని చెప్పిన ముఖ్యమంత్రి జీతాలు పెంచడానికి, పర్మినెంట్ చేయడానికి ఎందుకు ముందుకు రావట్లేదని విమర్శించారు. మున్సిపాల్టీని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి మున్సిపల్ కార్మికులతో సంప్రదింపులు జరిపి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఒకే రకమైన పనులు చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు విపరీతంగా ధరలు పెంచుతున్నాయని, సామాన్యులు, పేదలు భారాలు భరించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.సోమయ్య మాట్లాడారు. నాలుగు నెలలుగా స్కూల్ స్వీపర్లకు జీతాలివ్వకుండా ఇబ్బందులు గురి చేయడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ధనాల వెంకటరావు, కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు అప్పన్న, బంగారు వరలక్ష్మి, నిమ్మకాయల ధనలక్ష్మి, వచ్చా మోషే, బంగారు కామాక్షి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద రెండోరోజు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా

భీమవరం : దీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమా మహేశ్వరరావు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య హాజరై మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలో దళారీ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పి మరింత ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. మున్సిపల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనంచేసి 2 వేల మంది స్వీపర్లను ఇళ్లకు పంపించి మొత్తంగా జగనన్న ప్రభుత్వం అందరికి శఠగోపం పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే పనులు మాని ఈ నెల 27వ తేదీన మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని, ఆగస్టు ఏడో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ధనాల వెంకట్రావు, ధనాల దానయ్య, ఎబి శ్రీనివాస్, కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు రెండో రోజు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కౌరు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కామన మునిస్వామి, యూనియన్ నాయకులు నీలాపు ఆదినారాయణబాబు, మజ్జి కృష్ణబాబు, కోట నవీన్, ఉరింకి నాగరాజు పాల్గొన్నారు.

పన్నుల వసూలే.. సమస్యల పరిష్కారం లేదు

రోడ్ల మరమ్మతుల కోరుతూ చేపట్టిన దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలపై పన్నులు వేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. మడుగుపోలవరం నుంచి నవుడూరు సెంటర్ వరకూ రోడ్డు విస్తరించాలని, అలాగే ఛిద్రమైన రోడ్లను వెంటనే పటిష్టపర్చాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం కొణితివాడ పుచ్చపల్లి సుందరయ్య విగ్రహం నుంచి నవుడూరు సెంటర్ వరకూ సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి నవుడూరు సెంటర్ వద్ద నిరసన దీక్ష చేశారు. ఈ దీక్షా శిబిరాన్ని బలరాం ప్రారంభించి మాట్లాడారు. నాలుగేళ్లుగా జిల్లా వ్యాప్తంగా రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా మొండిగా ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నియంత్రించడంలో నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఆర్అండ్‌బి, జిల్లా

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయితీ రోడ్లను తక్షణం బాగుచేయాలన్నారు. రోడ్ల పరిస్థితిని తక్షణ సమస్యగా అధికారులు గుర్తించాలన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పాడైన రోడ్లను పట్టించుకోకపోతే దశలవారీ పోరాటం చేస్తామన్నారు. జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల సిపిఎం ఎప్పుడూ పోరాడుతూ ఉంటుందన్నారు. 2018లో అప్పటి ఎంఎల్ఎ అంజిబాబు రూ.7.50 కోట్లతో నత్తారామేశ్వరం నవుడూరు, కొణితివాడ మీదుగా కవిటం వరకూ ఆర్అండ్‌బి రహదారిని విస్తరించేందుకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగలేదన్నారు. కొణితివాడ నుండి నవుడురు సెంటర్‌కు వచ్చే అనేక మంది పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం శాఖలు పెనుమంట్ర, వీరవాసరం మండలాల నుంచి సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీగా వెళ్లి భీమవరంలో కలెక్టర్‌కు వినపత్రం అందజేయనున్నామని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. జిల్లా నాయకులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ప్రజారవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నిరసన దీక్షకు టిడిపి నాయకులు మైగాపుల నాగభూషణం, నవుడూరు వర్తక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం, పాలకోడేరు, పెనుమంట్ర మండల కార్యదర్శులు పోతుల మృత్యుంజయ్య, అశ్రియ్య, కె.సుబ్బరాజు, యాళ్లబండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ జుత్తిగ సాంబియాంబ, జ్యోతిబసు, కోటేశ్వరరావు, రెడ్డి రామారావులు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్యప్రసాద్, వలీ పాల్గొన్నారు.

సరిపల్లిలో దళితుల భూముల్లో దౌర్జన్యం

ఆక్రమితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సరిపల్లి గ్రామంలో దళితుల భూముల్లో దౌర్జన్యం చేస్తున్న వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌డిఒ దాసి రాజుకు కెవిపిఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి బాబు మాట్లాడుతూ గణపవరం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన దళితులు సుమారు 80 సంవత్సరాలు పైబడి గ్రామంలోని 2.50 సెంట్ల భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పేద దళితులు 23 మంది వాటాదారులతో ఐక్యంగా ఉమ్మడి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. ఆ పంటపై వచ్చిన ఫలాలతో దళితుల్లోని వృద్ధులు, వితంతువులకు అండగా నిలుస్తూ, దళితపేట అభివృద్ధికి ఉపయోగిస్తున్నారని తెలిపారు. నాటి నుంచి 2019 వరకూ సాగు చేసుకునే నిమిత్తం ప్రభుత్వానికి పన్ను

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు

కూడా చెల్లించారని గుర్తుచేశారు. అయితే అదే గ్రామానికి చెందిన భూస్వామి క్రొవ్విడి కృష్ణసాయి అతని అనుచరులు ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, తప్పుడు ఫిర్యాదులతో దళితులను చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. కృష్ణ సాయి, అతని అనుచరులపై తక్షణం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితులు దానియేలు, శామ్యూల్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వీరస్వామి అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు ఆకుకూరలు, గుడ్డు, పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన పిల్లలు జన్మిస్తారన్నారు. నిద్రలేమి గానీ, అధికంగా కష్టపడటం గానీ చేయకూడదన్నారు. ప్రతి శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో దాతలు ముందుకొచ్చి పౌష్టికాహారం అందించడం గొప్ప విషయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణ రాజు, కొప్పర్తి వీరరాఘవులు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాతల సహకారంతో గోంగూర, పాల కూర, కోడి గుడ్లు, బ్రెడ్స్, వేరుశెనగ ఉండలు 62 మంది గర్భిణులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రామా మహేశ్వరి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - ఉండి

ఉండి పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎంపిపి, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కైగాల శ్రీహరి నారాయణరాజు తెలిపారు. శుక్రవారం పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న పొదలను తొలగించాలని, ప్రసవ గదిలో శిశువు ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడానికి కావాల్సిన పరికరాలను ఏర్పాటు చేసేందుకు తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండి సర్పంచ్ కమతం సౌజన్య బెన్నీ, పిహెచ్‌సి వైద్యులు పంజా ధర్మతేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో 75 మంది విద్యార్థులకు రేపాకవారి సత్రం వారు శుక్రవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ ఫ్యామిలీ చైర్మన్ రేపాక వెంకట వీర్రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు ఇస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, హెచ్ఎం రావుపూడి భువనేశ్వరీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

'ప్రజల కష్టాలు తీర్చేది టిడిపినే'

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజల కష్టాలు తీర్చే పార్టీ టిడిపి మాత్రమేనని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలకు పథకాన్ని ఆయన వివరించారు. మహిళా నాయకులతో ఇంటింటికీ వెళ్లి మహిళలకు ఇస్తున్న పథకాల గురించి వివరించారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే వారందరికీ ఒక్కొక్కరికీ 15 వేల రూపాయలు చొప్పున ఇవ్వనుందన్నారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి రాజ్యలక్ష్మి, పాల దుర్గాభవాని, బస్వాని నాగమణి, గుడాల సునీత, కొలచన పద్మ, యానిస్ బేగం, తిరుమాని చక్రవర్తి, మహా లక్ష్మణరావు పాల్గొన్నారు.

దోమల నివారణతో జ్వరాల నియంత్రణ

ప్రజాశక్తి - పాలకోడేరు

దోమల నివారణ ద్వారానే జ్వరాలను నియంత్రించవచ్చని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ రంగనాయుడు అన్నారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా శుక్రవారం వెంకరాయపురం పంచాయతీ మురికివాడ ఏరియాలో ఫీవర్ సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత పాటించాలని, నిలువ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వదలడం ద్వారా, మరుగుదొడ్డికి ఉన్న గాలి గొట్టానికి దోమలు వెళ్లకుండా చిక్కని వల గుడ్డను కట్టడం ద్వారా దోమల ఉధృతి తగ్గించవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

'మూడున్నరేళ్లయినా పూర్తవని మెడికల్ కాలేజీ'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సమీపంలో మెడికల్ కాలేజీకి సిఎం జగన్ బటన్ నొక్కి మూడున్నరేళ్లయినా పూర్తి చేయలేదని తాము సెల్ఫీ ఛాలెంజ్ చేయాల్సి వస్తుందని భయపడి ఏటిగట్టు మీద లారీలు అడ్డుకోవడంతో పని ఆగిందని కవురు శ్రీనివాస్ కాకమ్మ కథలు చెబుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీ పేరున వైసిపి నేతలు కోట్ల విలువైన ఇసుక కొల్లగొట్టారని ఆరోపించారు.

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పట్టణంలోని మాధవాయిపాలెంలో వరద ఉధృతిని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటి గట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, కొల్లు పెద్దిరాజు, బర్రె మురళి, కొప్పాడ సత్యనారాయణ భూపతి బాబ్జి, పద్మారావు ఉన్నారు.

నేరాలు.. ఘోరాలు..

స్కూల్ బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం ఆర్అండ్‌బి రోడ్డులో జక్కరం గ్రామం శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం వన్‌టౌన్ పెద్దపేటకు చెందిన నీలపు ప్రభుతేజ(23) శుక్రవారం సాయంత్రం తన స్నేహితులను కలవడానికి బైక్‌పై జక్కరం గ్రామం వెళ్లి తిరిగి భీమవరం బయలుదేరాడు. ఈ క్రమంలో జక్కరం సెంటర్‌కు చేరుకునే సరికి భీమవరం నుంచి వస్తున్న స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభుతేజ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు జెమిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మణి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని యండగండి గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కొండ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,420 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఉండి ఎస్ఐ తెలిపారు.

పాలకోడేరు : పెన్నాడ శివారులో పేకాటస్థావరంపై పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బంగారం పోయిందని ఫిర్యాదు

గణపవరం : మండలంలోని ఎ.గోపవరం గ్రామానికి చెందిన అడపా దుర్గాభవాని తన బంగారం పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం దుర్గాభవాని ఈ నెల 19వ తేదీన తన కుమార్తెతో కలిసి గోపవరం నుంచి చాగల్లులో తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు పిప్పరలో ఆటో ఎక్కింది. గణపవరంలో దిగే సరికి తన బ్యాగు తెరిచి ఉంది. అందులో ఉన్న రెండున్నర కాసుల నల్లపూసల దండ చోరీ గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హుండీలో నగదు చోరీ

వీరవాసరం :కొణితివాడ గ్రామ పంచాయతీ పరిధి నరసన్నచెరువుపాలెం దేవాలయంలో హుండీలోని నగదును గురువారం రాత్రి చోరీకి గురైంది. శుక్రవారం సిఐ నాగప్రసాద్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల నిర్మించిన పుంతలో మునసబు దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీ తాళం పగలగొట్టి అందులోని నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు దేవాలయ నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి మంతెన సీతారాం హాజరై మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, సామాన్యుడు బతకలేని స్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతుంటే మరోపక్క కూరగాయల ధరలు పేలిపోతున్నాయన్నాయన్నారు. ధరలను నియంత్రిస్తాం, రైతాంగాన్ని ఆదుకుంటాం, స్వర్ణ భారతాన్ని సాధిస్తాం అని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అభివృద్ధి సూచీలో భారత దేశాన్ని అట్టడుగు స్థాయికి దిగజార్చిన ఘనత మోడీదని విమర్శించారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ లౌకికతత్వాన్ని దెబ్బతీస్తూ అట్టడుగు వర్గాలవారిపై దాడులు చేస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ఇచ్చినా పనులు పూర్తికాకుండా ఇవ్వడం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాళ్వా పంట సొమ్ము పూర్తిగా రైతులకు, కౌలురైతులకు అందలేదని, ప్రస్తుతం సార్వా పెట్టుబడులకు చేతిలో డబ్బులేక నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధాన్యం బకాయిలు విడుదల చేయాలని బలరాం డిమాండ్ చేశారు. చేతివృత్తిదారులకు ఉపాధిని చూపించి వారిని ఆదుకోవాలన్నారు. దళితుల శ్మశాన సమస్యలను, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చింతకాయల బాబూరావు, డి.కళ్యాణి, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

టిడిపి హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో దోపిడీ

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో వేల కోట్లు దోచేశారని, వందల కోట్లు మనీ లాండరింగ్ జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు రుణమేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ చదరపు అడుగుకు రూ.1,250 ఖర్చయ్యే దానికి రూ.2,100లకు ఒప్పందం కుదుర్చుకుని చంద్రబాబు వేల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. ఈ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగిందన్నారు. తాడేపల్లిగూడెంలో మొత్తం 5376 ఇళ్లకు ఇప్పటికే 2272 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా 1285 కుటుంబాలు ఇక్కడకు నివాసాలకు వచ్చాయన్నారు. మిగిలిన 3104 యూనిట్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉందన్నారు. అయితే ఇందులో 1285 యూనిట్లకు సంబంధించి బ్యాంకు లింకేజీ జరగాల్సి ఉందన్నారు. వివిధ కారణాలతో బ్యాంకులు వారికి రుణాలు ఇవ్వకపోవడం, చంద్రబాబు కుట్రతో నిర్మాణ కంపెనీ ఉద్దేశపూర్వకంగా పనులు నిలిపివేయడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందన్నారు. టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీకి ఏ బ్యాంకు అయినా ముందుకు రావడానికి మొండికేస్తే అలాంటి బ్యాంకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అవసరం లేకపోయినప్పటికీ చంద్రబాబు షీర్వాల్ టెక్నాలజీ పేరుతో దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. దుబాయిలో అత్యంత ఎత్తు నిర్మించే కట్టడానికి మాత్రమే ఇలాంటి టెక్నాలజీ ఉపయోగించారని అటువంటి టెక్నాలజీ ఇక్కడ అవసరం లేకపోయినా ఉపయోగించి వేల కోట్లు దోచేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేవలం ఒక్క రూపాయికే 300 చదరపు అడుగుల టిడ్కో గృహాలను పేదలకు ఉచితంగా ఇస్తుందన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి లబ్ధిదారులందరికీ ఇళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, మెప్మా పీడీ ఇమ్మానుయేలు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్, టిడ్కో ఇఇ స్వామి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా రుణ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి కొట్టు మొక్కలు నాటి నీరు పోశారు.

మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై అంతర్జాతీయ సదస్సు

సెప్టెంబర్ 25, 26 తేదీల్లో

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల నానో టెక్నాలజీ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25, 26 తేదీల్లో ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను ఆయన శుక్రవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ మెటీరియల్ ఇంజినీరింగ్, మెటీరియల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ పేరిట ఎంఇసిఎపి-23 సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మెటీరియల్స్ పరిశోధనలో ఎన్నో మంచి ఫలితాలు వస్తున్నాయని వాటి ఫలితాలు సమాజానికి అందుతున్నాయని, వాటిని మరింత ఎక్కువ స్థాయిలో ఉపయోగపడే విధంగా అంతర్జాతీయ నిపుణులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సదస్సు కన్వీనర్ ఆర్.వేణురెడ్డి, ఆర్అండ్‌డి డీన్, డైరెక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఈ సదస్సులో పాల్గొనేందుకు అంతర్జాతీయ పరిశోధకులు సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు, ఎస్‌వి రంగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ ఎవల్యూషన్ కెవి మురళీకృష్ణమరాజు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణాలు మంజూరు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిసిఆర్‌సి కార్డులకు ఎటువంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పొలమూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో శ్రీనివాస రైతు మిత్ర గ్రూప్‌నకు రుణం ఇవ్వకపోవడంపై బ్యాంకు ముందు కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి రూ.65 వేలు రుణం సదుపాయం కల్పించాలన్నారు. విషయం కొద్దిసేపటికి ఎఒ ఎ.జ్యోషిలకు తెలియడంతో బ్యాంకుకు వచ్చి గ్రూప్ సభ్యులను సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్ కె.సునీల్‌కుమార్‌తో, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజుతో చర్చలు జరిపారు. బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడానికి మేనేజర్ సునీల్ కుమార్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కేతా శ్రీనివాస్, కౌరు ప్రసాద్, చింతపల్లి తిరుమల, త్రిమూర్తులు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కౌలు రైతులు, నేతలు

గ్రామాల్లో మాథ్యూస్ బృందం పర్యటన

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల్లో వైద్య సేవల అమలు తీరు ప్రశంసనీయమని కేసి మాథ్యూస్ బృందం తెలిపారు. శుక్రవారం మండలంలోని కలిగొట్ల, ఆరేడు గ్రామాల్లో పర్యటించిన కెసి మాథ్యూస్ కేంద్ర బృందం గ్రామాలలో వైద్య సేవలు అమలు తీరును, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో వైద్య సేవలు విస్తరించడంలో గ్రామ ఆరోగ్య సిబ్బంది పనితీరు బాగుందని అన్నారు. గ్రామాల్లో పర్యటించిన బృందం ఆయా గ్రామాల సర్పంచులను కలిసి గ్రామంలోని రక్షిత నీటి సరఫరా, పారిశుద్ధ్య పరిరక్షణకు గ్రామ పంచాయతీ తీసుకునే చర్యల గురించి, ప్రజల జీవన విధానం, గ్రామాల్లో విస్తరించే అంటు వ్యాధుల గురించి ఆరా తీశారు. పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారిని పరామర్శించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జి.సుగుణ రాజు, జిల్లా స్టాటిస్టికల్ అధికారి శరభేశ్వర ప్రసాద్, యండగండి పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రత్నరాజు, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.వెంకటరమణ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

గోదావరి పరివాహక గ్రామాలైన మండలలోని పాత నవరసపురం, కొత్త నవరసపురం ఎస్‌టి కాలనీలో తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్ శుక్రవారం పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత గ్రామాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి మండల కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు రూరల్ ఎస్ఐ సుధాకర రెడ్డి, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రటరీలను క్రమబద్ధీరించి, వారిని సచివాలయ వ్యవస్థ ఉద్యోగులుగా గుర్తించి సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి అధ్వర్యంలో ఎపి. గామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ పి.ప్రశాంతికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్లను క్రమబద్ధీకరించాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ దానియేలు మోర్లే అన్నారు. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంతంలో శుక్రవారం మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, యమిజాల లక్ష్మీనరసింహమూర్తి, పిఇటి ఎన్.లక్ష్మి పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీస్ సిబ్బంది ఎప్పుడూ శారీరకంగా, మానసికంగా దఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలందించగలరని జిల్లా అడిషనల్ ఎస్‌పి అల్లూరి సుబ్బరాజు అన్నారు. స్థానిక మార్కెట్ వద్ద గ్రౌండ్‌లో సివిల్, ఎఆర్, హోం గార్డ్ పోలీస్ సిబ్బందికి మొత్తం 202 మందికి శుక్రవారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి శ్రీనాథ్, ఎఆర్ డిఎస్‌పి ఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గొల్లలగోడేరులో హెల్మెట్ డ్రైవ్

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని గొల్లల కోడేరులో శుక్రవారం పోలీసులు హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. షిఫ్టులవారీగా పాలకోడేరు, ఉండి, భీమవరం, వీరవాసరం పోలీసు స్టేషన్లకు సంబంధించిన సిబ్బంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఇక్కడ హెల్మెట్ల అమ్మకందారులకు అమ్మకాల జోరు సాగింది. సుమారు ఒక రోజంతా పోలీసులు హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో వ్యాపారులంతా ఇక్కడ క్యూకట్టారు. గొల్లలకోడేరు-తాడేపల్లిగూడెం రహదారిలోని ఒక ఖాళీ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసి హెల్మెట్ల విక్రయాలు చేశారు. పోలీసులు హెల్మెట్ లేని వారితో తప్పనిసరిగా వాటిని కొనిపించడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది.

ఇళ్ల స్థలాల పట్టాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో ప్రతిఒక్కరూ సొంత ఇల్లు కలిగి ఉండాలని, అదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యనమదుర్రు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 32 లక్షల మంది పేదలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఇంటి స్థలాలను పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు.

ఆపన్నులను ఆదుకోవాలి : మానవత

ప్రజాశక్తి - ఉండి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని మానవత విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత మండల సమావేశం ఆరేడు గ్రామంలో సంస్థ మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షునిగా కట్రెడ్డి తాండవనాగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పెన్మెత్స రామకృష్ణంరాజు, కోశాధికారిగా తిర్లింగ మహేష్, ఉపాధ్యక్షుడిగా తాడి మునీశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా గంధం ఏడుకొండలు, వర్రే రామయ్య, కాగిత సోమేశ్వరరావు, విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సంస్థ మండల అధ్యక్షుడు దంగేటి రామలింగేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

విద్యాసామగ్రి పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల బ్రాంచి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక సహకారంతో విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు వీరమల్లు జనార్దనరావు అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వార్షికోత్సవం సందర్భంగా సీసలి వడ్డీగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రిని అందించారు. రూ.ఆరు వేల విలువైన విద్యాసామగ్రి, రెండు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బెల్లకుర్తి శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ రామ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనిల్ కుమార్, క్యాషియర్ మూర్తి, బ్యాంక్ సిబ్బంది కోటి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మొగల్తూరు ఉపాధ్యక్షునిగా గోపాలకృష్ణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరుకు చెందిన అనంతపల్లి గోపాలకృష్ణ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మొగల్తూరు విభాగానికి ఉపాధ్యక్షునిగా ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తానని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు కోన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియామక పత్రం అందించారని తెలిపారు. పలువురు సంఘం సభ్యులు ఆయనను అభినందించారు.

25న విద్యాసంస్థల బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.అప్పలస్వామి, సిహెచ్.సుందర్ కోరారు. ఈ మేరకు భీమవరంలో ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ నాయకులు బంద్ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

విఆర్ఎల న్యాయమైన డిమాండ్లు, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్‌కె.హుసేన్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకుడు నాని, కె.రవి, రోబీయమ్మ పాల్గొన్నారు.

ర్యాంకుల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీ ర్యాంకుల సాధనకు కృషి చేయాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.కృష్ణ అన్నారు. ఆయన గణపవరం డిగ్రీ కాలేజీని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యాపకులకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, లెక్చరర్లు పాల్గొన్నారు.

లక్ష్మికి పలువురి అభినందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

కుమ్మరి, శాలివాహన సంఘం వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర సభ్యులుగా నెగ్గిపూడి ఎంపిటిసి సభ్యులు పెనుగొండ లక్ష్మి ఎంపికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర ఛైర్మన్ పురుషోత్తం రెండు రోజుల క్రితం నియామకం చేయడం పట్ల శుక్రవారం స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను వైసిపి జిల్లా కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మండల మాజీ కన్వీనర్ సత్తి విష్ణు కుమార్ రెడ్డి, నెగ్గిపూడి 11 వార్డు మెంబర్ పెనుగొండ నరసింహమూర్తి అభినందించారు.

మహిళకు తోపుడుబండి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు బస్టాండ్ వద్ద పేరంటాలు అనే మహిళకు జొన్నపొత్తుల వ్యాపారం చేసుకునేందుకు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ తోపుడుబండి అందించారు. తన భర్త చనిపోయాడని, తన కుటుంబ పోషణ కష్టంగా ఉందని, వ్యాపారం చేసుకోడానికి బండి కావాలని పేరంటాలు ఇటీవల తాతాజీ వద్దకు రాగా ఆయన బండి చేయించి శుక్రవారం ఆమెకు అందించారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇ పాస్ మిషన్‌లో ఉన్న దానికి, నిల్వలకు వ్యత్యాసం వస్తే సహించమని సివిల్ సప్లై ఆర్ఐ పోతురాజు డీలర్లకు సూచించారు. వెలగలేరులోని డిపో నెంబర్-28లో గ్రామానికి చెందిన పడాల నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సివిల్ సప్లై ఆర్ఐ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఇ పాస్ మిషన్‌లో ఉన్న దానికి కన్నా పంచదార పది ప్యాకెట్లను, 72 కేజీల కందిపప్పు, 70 కేజీల బియ్యం తగ్గినట్లు గుర్తించామని తెలిపారు. నిర్వాహకునిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

నరసాపురం మండలం, చిట్టవరంకు చెందిన గొల్ల సుధ అను నేను ది. 11-7-2023 మంగళవారం చిట్టవరం నుంచి పాలకొల్లు మండలం దిగమర్రుకు చెందిన మా బంధువు ఇంటికి నా వీసా గురించి మాట్లాడటానికి నా భర్తతో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా నేను వైజాగ్‌లో 21-02-2023లో పొందిన **X5967182** పాస్‌పోర్టు దారిలో పడిపోయినది. దారిలో ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందచేయ వలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా అడ్రస్:
గొల్ల సుధ, W/o. శ్యామలరావు
డోర్ నెం. 3-40, లంగరువు
చిట్టవరం గ్రామం, నరసాపురం మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9493833533

డాక్యుమెంటు పోయినది

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ది. 18-7-2023వ తేదీన నా స్థలమునకు చెందిన లింకు డాక్యుమెంట్లు అనగా డాక్యుమెంటు నెం. 5146/2004, **డాక్యుమెంటు నెం. 9213/2016** లు నేను జిరాక్స్ తీయించే నిమిత్తము తీసుకుని ఇంటి వద్ద నుండి జిరాక్స్ షాపునకు తీసుకుని వెళ్ళుతుండగా దారి మధ్యలో ఎక్కడనో జారి పడిపోయినవి. కావున పై తెల్పిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికినచో వెంటనే నాకు అందజేయవలెను. అట్లు అందించిన వారికి మంచి బహుమతి ఇవ్వబడును అని యిందు మూలముగా తెలియజేయుచున్నాను.

అడ్రస్:
బేతిరెడ్డి ఇంద్రావతి, W/o. ఈశయ్య
డోర్ నెం. 6-95, పల్లపు వీధి
పెనుమంట్ర, ప॥గో॥జిల్లా, (ఎపి),
పిన్: 534124, సెల్: 8184891939